
# సెల్‌ఫోన్

అనువాదకథ



ఆంగ్లమూలం: శిశిర్‌మోహన్
అనువాదం: కొల్లూరి సోమశంకర్

విమానాశ్రయం చేరగానే నేను నా చుట్టూ ఉన్న పరిసరాలను ఆత్రుతగా చూసాను.

నేనెక్కాల్సిన విమానం బయల్దేరడానికి ఇంకా సమయం ఉంది.

నా సెల్‌ఫోన్ బయటకు తీసాను.

చిన్నగా నవ్వుకుంటూ, "అమ్మయ్య! ఇంక మూడు కాల్స్ చేస్తే చాలు, ఈ రోజుకీ పనయిపోతుంది.

హాయిగా, విశ్రాంతిగా కూర్చుని ప్రయాణాన్ని ఆస్వాదించవచ్చు.

వాల్ స్ట్రీట్ జర్నల్ చదువుకుంటూ, ఉప్పుశనగలు తింటూ, చల్లటి బీరు తాగుతూ వీకెండ్‌లో జరిగే ఫుట్‌బాల్ మ్యాచ్‌ని ఎలా చూడాలో ప్లాన్ చేసుకోవచ్చు..." అని అనుకున్నాను.

కాని నా మొబైల్‌ని ఆన్ చేయగానే, చార్జింగ్ అయిపోయినట్లు సూచించింది.

"ఓహ్!" అని విసుగ్గా అనుకున్నాను. నాకు చిరాగ్గా ఉంది.

చేతిలో సెల్‌ఫోన్ ఉండి కూడ ఇతరులతో మాట్లాడలేకపోవడం ఎంత దారుణం? నేను తొందరగా ఒక ప్లగ్ పాయింట్‌ని వెతుక్కోవాలి... తొందరగా! సుశిక్షితులైన నా కళ్ళు ఒక మూలగా ఉన్న టేబుల్‌ని, దాని పక్కనే ఉన్న ప్లగ్ పాయింట్‌ని పసిగట్టాయి.

"ఆహా, మంచి స్థలం! నేను చార్జింగ్ చేసుకోడమే కాదు, కాసేపు ఏ ఆటంకాలు లేకుండా పని కూడ చేసుకోవచ్చు" అనుకున్నాను. ఆ స్థలం కోసం ఇంకెవరైనా పోటీ పడుతున్నారా అని అటు ఇటూ చూసాను. ఓ లావుపాటి వ్యక్తి అదే టేబుల్‌వైపు రావడం కనిపించింది. అంతే! నేను బాణంలా దూసుకుపోయాను. ఆ టేబుల్‌ని ఆక్రమించడం, చార్జింగ్ చేయడం కోసం వైరుని ప్లగ్ పాయింట్‌లో పెట్టడం క్షణాలలో జరిగిపోయాయి. ఆ లావుపాటి వ్యక్తి విస్తుపోయాడు. నేను ఓ నవ్వు నవ్వి, భుజాలెగరేసాను. మరేం చేయను? ఇది క్రూరమైన ప్రపంచం! బలమూ, చొరవ ఉన్నవాడిదే రాజ్యం ఇక్కడ! విజయగర్వంతో నా మొబైల్ ఆన్ చేసి నా ఆఫీస్‌కి ఫోన్ చేసాను. అక్కడ నా సెక్రటరీ ఫోనెత్తింది.

“హాయ్ జెన్నీ, ఏంటి విషయాలు?” అని అడిగాను.

“పరిస్థితులు దారుణంగా ఉండబోతున్నాయి” అందామె పరాకుగా.

“ఏం జరిగింది?” అని అడగబోయి మానుకున్నాను. ఎందుకంటే ఇదివరకొకసారి ఇదే ప్రశ్న వేస్తే, తన భర్తా, అతడి మాజీ ప్రేయసిల వ్యవహారం గురించి సుదీర్ఘమైన ఉపన్యాసం ఇచ్చింది. ఆ సంఘటనని జ్ఞాపకం తెచ్చుకుని, “నాకేమైనా ఫోన్లు వచ్చాయా? తర్వాత జాన్‌కి కనెక్షన్ ఇవ్వు” అని అన్నాను. బహుశా ఆమె నాతో ఏదో చెప్పాలనుకున్నట్లుంది. “అలాగే” అంటూ నాకొచ్చిన ఫోన్ల వివరాలు చెప్ప సాగింది. ఆమె స్వరంలో నిరాశ ధ్వనించింది.

ఇంతలో నా పక్కనే కూర్చుని ఉన్న ఓ వ్యక్తి గట్టిగా అరిచాడు.

“ఆపండి” అంటూ నాకేసి వేలు చూపిస్తూ, “ఆ దరిద్రపు ఫోన్‌లో మాట్లాడడం ఆపండి” అని మళ్ళీ అరిచాడు.

అతడికేసి ఆశ్చర్యంగా చూసాను. అతడిది ఎర్రజుట్టు, పొడవైన ముక్కు, అసహనం తొణికిసలాడే ముఖం!

“చెప్పండి, ఏంటి మీ సమస్య?” అని అన్నాను, ఏం మాట్లాడాలో తెలియక.

అతడు మరింత విసుగ్గా, “ఇప్పుడు నేనన్నది వినపడలేదా?” అని అన్నాడు. అతడి ముక్కు పుటాలు అదురుతున్నాయి. “ఆ ఫోన్‌లో మాట్లాడడం ఆపండి” అని ఇంకోసారి అరిచాడు.

“నేను తర్వాత ఫోన్ చేస్తాను” అని జెన్నీకి చెప్పి ఫోన్ కట్టేసాను. ఈ సంభాషణంతా ఆమె విని ఉండకపోవచ్చు. విన్నదంటే మాత్రం, మా ఆఫీసులో చాలామందికి కాఫీ మిషన్ దగ్గర మాట్లాడుకుంటూ నవ్వుకోడానికి మంచి టాపిక్ దొరికినట్లే!

మరుక్షణం నా దృష్టిని ఈ ఎర్రటి జుట్టు వ్యక్తివైపు మరల్చాను.

“సరే, నేను నా సెల్‌ఫోన్‌లో ఎందుకు మాట్లాడకూడదు? ఇక్కడ అలాంటి నియమం ఏదైనా ఉందా?” అని అతడిని అడిగాను.

“నా చుట్టుపక్కల ఎవరూ సెల్‌ఫోన్‌లో మాట్లాడడం నాకిష్టం ఉండదు. సెల్‌ఫోన్లంటేనే నాకు అసహ్యం! మీరెళ్ళి ఇంకెక్కడైనా కూర్చోవచ్చు కదా?, ఇక్కడ చాలా కుర్చీలు ఖాళీగా ఉన్నాయి...” అని అన్నాడతను రొప్పుతూ.

“బాగుంది వరస, ప్లగ్ పాయింట్ ఉందని నేనిక్కడ కూర్చున్నాను” చెప్పాను నేను కొంచెం కోపంగా.

“లేచి వెతుక్కోండి, ప్లగ్ పాయింట్లు ఇంకా చాలా చోట్ల ఉంటాయి” అని అన్నాడతడు.

“ఆ పనేదో మీరే చెయ్యొచ్చుగా, ఎయిర్‌పోర్టులో ఇంకా చాలా కుర్చీలు ఖాళీగా ఉన్నాయి” అని అన్నాను. నాకేమో ఓ పక్క బి.పి. పెరిగిపోతోంది.

“కాని మీకన్నా ముందుగా ఇక్కడికి వచ్చి కూర్చున్నది నేను...” అని అన్నాడతడు.


“అయితే ఏంటి? నేను నా పని పూర్తయ్యేదాకా...” ఇంకా నా మాటలు పూర్తి కాలేదు, ‘ఢబ్’ మన్న శబ్దం వినిపించింది. ఆ మనిషి కింద పడిపోయాడు. అతడి కాళ్ళు చేతులు కొట్టుకుంటున్నాయి. ముఖం ఎర్రబడింది. పెదాలు వణుకుతున్నాయి.



## డైరెక్ట్ ఇన్‌డైరెక్ట్

క్లాసులో ఇంగ్లీష్ పాఠం చెబుతూ మాస్టారు “సోమూ! డైరెక్ట్ స్పీచ్‌కి, ఇన్‌డైరెక్ట్ స్పీచ్‌కి తేడా చెప్పు” అన్నారు.

“నిన్న మీరు పేపర్లు ఇస్తూ, నాకు మార్కులు సరిగ్గా రాలేదని నన్ను తిట్టారు. అది డైరెక్ట్ స్పీచ్. మీ అబ్బాయికి మార్కులు సరిగ్గా రాలేదని పక్కనేవున్న నన్ను మళ్ళీ తిట్టారు అది ఇన్‌డైరెక్ట్ స్పీచ్.



అతడికి ‘గుండెపోటు’ వచ్చేలా ఉందని నాకు తోచింది. ఇద్దరు ముగ్గురు గుమిగూడారు.

“మీరంతా నన్నెందుకు చుట్టుముట్టారు? ఇక్కడ్నించి వెళ్ళిపొండి” అని అరిచాడు ఆ వ్యక్తి.

“దయచేసి నా స్థలం నాకివ్వండి” అని ప్రాధేయపడ్డాడు.

నాకింకా కోపం తగ్గలేదు. “నేనిక్కడే ఉంటాను. సెల్‌ఫోన్‌లో మాట్లాడతాను...” అని అన్నాను ఉడుక్కుంటూ.

చిన్న పిల్లాడిలా మాట్లాడుతున్న నాకేసి ఓ క్షణం నిరసనగా చూసాడు. తర్వాత లేచి కుర్చీలో కూర్చున్నాడు.

“అవును. నేనిక్కడే ఉంటాను. ఏం చేస్తారు? సెక్యూరిటీ గార్డులను పిలుస్తారా? నాకు తెలిసినంతవరకు, ఎయిర్‌పోర్టులలో సెల్‌ఫోన్‌లలో మాట్లాడకూడదన్న నియమం ఏదీ లేదు...” అని అన్నాను నేను బింకంగా.

“చూడండి, నేను నియమాల గురించి మాట్లాడడం లేదు. సభ్యత గురించి మాట్లాడుతున్నాను. సెల్‌ఫోన్లు ఈ ప్రాంతాన్ని పాడు చేస్తున్నాయి. ఇతరులు సెల్‌ఫోన్లలో మాట్లాడుతుంటే, పక్కవాళ్ళకి శ్వాస పీల్చుకోడం కూడ కష్టమైపోతోంది. దయచేసి నా స్థలాన్ని నాకివ్వండి. కాస్త ప్రశాంతతకి నోచుకోనివ్వండి. వెళ్ళి ఇంకో కుర్చీలో కూర్చోండి” అని అన్నాడతడు.

“మీ సొంత స్థలంకావాలంటే, మరో దేశం వెళ్ళండి. భారతదేశానికి వెడితే తెలుస్తుంది- అక్కడ జనాలతో కిక్కిరిసిన ప్రాంతాలలో తిరగడం ఎంత కష్టమో!” అని అందామని నోటిదాకా వచ్చింది. కాని ఆపుకున్నాను. ఈ సంభాషణని ఇంకా పొడిగించడంలో అర్థం లేదు. ఇతగాడితో మాట్లాడుతూ కూర్చుంటే, నా పన్లన్నీ ఆగిపోతాయి. పైగా నేను ఇంకా కొన్ని ముఖ్యమైన ఫోన్లు చేయాలి.

“సరే సరే! మీరే గెలిచారు. మీ స్థలంలో మీరే ఉండండి” అని నేను ప్లగ్‌పాయింట్‌లోంచి వైరు తీసేసాను. కొన్ని నిముషాల తర్వాత ప్లగ్ పాయింట్ ఉన్న మరో టేబుల్‌ని వెదుక్కొని, నేను మాట్లాడవలసిన వాళ్ళందరితోనూ మాట్లాడేసాను. ఇక ఈ-మెయిల్స్ చూసుకోడమే తరువాయి!

కాని అదే తప్పయిపోయింది! లాప్‌టాప్ తెరచి మెయిల్స్ చూసుకోగానే నాకు



క్లయింట్లు నాతో వెంటనే మాట్లాడాలని అడుగుతున్నారు. నా టీంలోని ఒక ఇంజనీరు రాజీనామా చేసాడు. వీటన్నింటిని మించినవార్త, నా సెక్రటరీ జెన్నీ(Jenny)• జాన్‌పై లైంగిక వేధింపుల నేరం కింద కేసు వేయబోతోందట!

దయారహితమైన కంప్యూటర్ తెరకేసి చూస్తూ, నిస్సహాయంగా... "దేవుడా" అని అనుకున్నాను.

తర్వాత ఓ అరగంట పాటు క్షణం తీరిక లేకుండా గడిపాను. మా బాస్‌తోను, క్లయింట్లతోను, తోటి ఉద్యోగులతోను కనెక్టయి ఉన్నాను. సెల్‌లో మాట్లాడడం కాని, ఈ-మెయిల్స్ పంపడం గాని చేసాను. నా బుర్ర బద్దలయ్యేలా ఉంది.

"అమ్మయ్య! అన్నీ సర్దుకున్నాయి" అని అనుకున్నానో లేదో... ట్రింగ్ ట్రింగ్‌మంటూ నా సెల్‌ఫోన్ మోగింది.

"దరిద్రపు మొహమా, ఛీ" అంటూ సెల్‌ఫోన్‌ను దూరంగా తోసాను. ప్లగ్ పాయింట్ నుంచి వైరుని తీసేసాను. "నా మానాన నన్నొదిలేయ్! కాస్త ప్రశాంతంగా ఉండనివ్వు" అని అంటూ సెల్‌ఫోన్‌ని ఓ భూతంలా చూస్తూ అరిచాను.

ఈ మాటలు నా నోట్లోంచిరాగానే హఠాత్తుగా నాకు ఇందాకటి ఎర్ర జుట్టు వ్యక్తి గుర్తొచ్చాడు. అతడన్న మాటలు ఎంతో నిజం! మనం, మనుషులం, మన ఉనికిని కోల్పోయాం. మనమే సృష్టించిన ఎలెక్ట్రానిక్ వస్తువులకి బానిసలమైపోయాం! సెల్‌ఫోన్లు, కంప్యూటర్లు, ఇంటర్‌నెట్ ఇప్పుడు మన జీవితాలని శాసిస్తున్నాయి.

నా విమానంలోకి ప్రయాణీకులు ఎక్కడం ప్రారంభించారు. ఒకప్పుడు పిలుచుకున్న ఫస్ట్‌క్లాస్, సెకండ్ క్లాసులు ఇప్పుడు విమానాలలో లేవు. ఇప్పుడంతా 'డైమండ్' 'గోల్డ్' లేదా 'సిల్వర్' కేటగిరిలే! ఇంకొన్ని విమానాలలో సీట్లకు ఖరీదైన జాతిరత్నాలపేర్లు కూడ పెడుతున్నారు. నేను కూడ క్యూలో నిలుచున్నాను. నా కళ్ళు తెరిపించిన ఆ ఎర్ర జుట్టు వ్యక్తికి కృతజ్ఞతలు చెబుదామని అటు ఇటూ చూసాను. కాని అతడి జాడలేదు. అతడు ఇవ్వాల్సిన సందేశాన్ని అందించి అదృశ్యమైపోయాడు కాబోలు!

దారిపొడవునా నాకు కొత్తగా కలిగిన జ్ఞానోదయం గురించే ఆలోచించాను. వృత్తి జీవితానికీ, వ్యక్తిగత జీవితానికి ఈ మధ్య ఉండాల్సిన విభజన రేఖ క్రమంగా చెరిగిపోతోంది. ఈ సమకాలీన సంస్కృతికి నేను 'సాంకేతిక బానిసత్వం' అనే కొత్తపేరు పెట్టాను. ఆఫీసులో కాని, ఇంటిలో కాని, మరెక్కడైనా ఉండండి. జరుగుతున్నదంతా- 'ఎల్లప్పుడూ కనెక్టెడ్'! కాని నిజానికి మనం అందరితోను కనెక్ట్ అయి ఉంటున్నామా? ప్రతి ఒక్కరితోను- మన కుటుంబ సభ్యులతోను, తోటి ఉద్యోగులతోను, సాటి మనుషులతోను మనసు విప్పి మాట్లాడుతున్నామా? ఒకరితో ఒకరం సన్నిహితంగా ఉండగలుగుతున్నామా? మన హృదయాలకీ, చేతలకీ పొంతన ఉంటోందా? ఇలా ప్రశ్నించుకుంటూ పోతే వచ్చిన జవాబులు నన్ను మరింత అశాంతికీ గురిచేసాయి.

** ** **

ఇల్లు చేరాక ఎప్పటిలా సెల్‌ఫోన్‌ని, కంప్యూటర్‌ని ఆన్ చేయలేదు. నా భార్యని, నా నాలుగేళ్ళ కొడుకుని పలకరించాను. వాళ్ళతో కులాసాగా కబుర్లు చెప్పసాగాను.

"నాతో మాట్లాడు నాన్నా" అంటూ మా అబ్బాయి నా చెవి మెలిపెట్టాడు.

"చెప్పరా బాబు" అన్నాను చెవిని రుద్దు కుంటూ.

"నీ పుట్టినరోజు కోసం, నేను అమ్మ ఓ మంచి బహుమతి తెచ్చాం" అన్నాడు గారంగా.

"నిజంగానా?" అంటూ నేను మా ఆవిడ కేసి చూసాను. "ఏం కొన్నారేంటి?" అని అడిగాను. బహుశా నేను ఎప్పటినుంచో కోరుకుంటున్న తేలికపాటి టైటానియం టెన్నిస్ రాకెట్ అయి ఉంటుంది. ఎందుకంటే దీని గురించి నేను నా భార్యతో రెండు మూడుసార్లు అన్నాను. కాని మా ఆవిడకి క్రీడాసామాన్లపై పెద్దగా ఆసక్తి లేదు. కాబట్టి టెన్నిస్ రాకెట్ కొని ఉండకపోయినా ఆశ్చర్యపోనక్కరలేదు.

"ఊహించండి" అని అంది మా ఆవిడ. నా పుత్రుడేమో వచ్చీరాని మాటలతో ఆ బహుమతిని వర్ణించడానికి అవస్థ పడుతున్నాడు. నేనేమో ఉత్సుకత ఆపుకోలేకపోయాను.

నా భార్య లోపలి గదిలోకి వెళ్ళి, కాసేపటి తర్వాత ఓ చిన్నపాకెట్‌తో ప్రత్యక్షమైంది. చిన్నపిల్లాడిలా దాన్ని గుంజుకుని చూసాను. బాక్సు మరీ చిన్నదిగా ఉంది. అది ఖచ్చితంగా టెన్నిస్ రాకెట్ అయి ఉండదు.

"తెరచి చూడు నాన్నా," అంటూ మా అబ్బాయి గోలపెట్టసాగాడు. నేను నిరాశగా దాన్ని తెరవసాగాను.

నా భార్య నా నిరుత్సాహాన్ని గ్రహించినట్లుంది. "ఏవండీ, మీకు నచ్చలేదా?" అని అడుగుతోంది.

కాని ఆ బహుమతిని చూడగానే నేను మంత్రముగ్ధుడినైపోయాను. దాన్ని చేతిలోకి తీసుకుంటూ, "చాలా బాగుంది. అద్భుతంగా ఉంది" అని అన్నాను. అది సన్నటి, నాజూకైన లేటెస్ట్ మోడల్ సెల్‌ఫోన్ పరికరం!

"మీరు చాలాసార్లు అంటుండేవారు కదా, సన్నని వెబ్ యాక్సెస్ ఉన్న లేటెస్ట్ సెల్‌ఫోన్ ఉంటే బాగుంటుందని! అందుకని మీకు పుట్టినరోజు కానుకగా కొన్నాను..." చెప్పింది మా ఆవిడ.

"అవును! మొత్తానికి సాధించావు" అని అన్నాను పరాకుగా. ఎయిర్‌పోర్టులో తారసపడిన ఎర్రజుట్టు వ్యక్తిని, నాకు కొత్తగా కలిగిన జ్ఞానోదయాన్ని తాత్కాలికంగా మరచిపోయాను.

లేత నీలం రంగులో మెరుస్తున్న ఆ సెల్‌ఫోన్‌ని సంభ్రమంగా చూడసాగాను. చాలా మృదువుగా ఉందది. దానికేసి మరోసారి చూసాను. చాలా అద్భుతంగా ఉందది.

ఇంక నన్ను నేను ఆపుకోలేకపోయాను. వెంటనే దాన్ని పరీక్షించాలని నిర్ణయించుకున్నాను. సిమ్‌కార్డువేసి మా ఆఫీసుకి ఫోన్ చేసాను. "నాకేమైనా ఫోన్లు వచ్చాయా?" అని అడిగాను. తర్వాత సెల్‌ఫోన్ నుంచే ఈ-మెయిల్స్ చూసుకోసాగాను.

ఇందాక చెప్పినట్లు ఇదంతా- "ఎల్లప్పుడూ కనెక్టెడ్"గా ఉండడమే! మనం బానిసలం... అలవాట్లకీ కూడ! ■



## టిఫిన్

మల్లిక చాలారోజులకు స్నేహితురాలు రోజా ఇంటికి వచ్చింది. కబుర్లు చెప్పుకోవడం అయ్యాక-

"టిఫిన్ తిన్నావా? లేకపోతే మా ఇంట్లో ఇడ్లీలు ఉన్నాయి తింటావా?" అని అడిగింది రోజా.

"తినే వచ్చాను. ఇప్పుడేమీ వద్దు. ఈసారి వచ్చినప్పుడు తింటాను" అంది మల్లిక.

"నువ్వు మళ్ళీ వచ్చేసరికి అవి పాడయిపోతాయి కదా" అంది రోజా.